క్లుప్తంగా

శివమాలధారణ స్వీకరణ



పాంబండపై శివమాలధారణ స్వీకరించిన భక్తులు

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం భక్తుల కోలాహలం నెలకొంది. వసంత పంచమితో పాటుగా భక్తులు భారీగా శివమాలలు స్వీకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమకు దీక్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చల్లంగా చూడాలని కాంక్షించారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐని సత్కరిస్తున్న ఈర్లపల్లి గ్రామస్తులు

దుద్యాల్: నూతనంగా విధుల్లో చేరిన దుద్యాల్ ఎస్ఐ యాదగిరిని ఈర్లపల్లి గ్రామస్తులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్ మాట్లాడుతూ.. మండలంలో ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలిగి శాంతి భద్రతలను పరిరక్షించాలని కోరారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మొగులయ్య, సేవ్యానాయక్, రాహుల్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేస్తున్న నాయకులు

ధారూరు: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ వైద్యానికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.50 లక్షలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంజూరు చేయించారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎల్ఓసీ అందజేశారు. మండల పరిధిలోని మైలారం గ్రామానికి చెందిన వంశీ రాజుల లక్ష్మి అనారోగ్యంతో నగరంలోని నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం స్పీకర్ ప్రసాద్‌కుమార్ రూ.2.50 లక్షలు మంజూరు చేయించి స్థానిక నాయకులతో ఎల్ఓసీని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ అశోక్ ముదిరాజ్, నాయకులు కిరణ్‌కుమార్, మహ్మద్ బాబాఖాన్, అమరేశ్వర్‌రావు, ఇబ్రహీం, రఘుగౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తోడ్పాటు



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న మల్లారెడ్డి

బషీరాబాద్: అణగారినవర్గాల పిల్లల చదువులకు చేయూతనివ్వడానికి బాధ్యతగా అందరూ ముందుకు రావాలని జ్యోతిరావుపూలే జాతీయ అవార్డు గ్రహిత యాస మల్లారెడ్డి కోరారు. సోమవారం వసంత పంచమి పురస్కరించుకుని మండలంలోని నావంద్గీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, చెప్పులు, సిట్టింగ్ మ్యాట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారి ఉన్నతికి ప్రోత్సహించాలని సూచించారు. సామాజిక సేవాకార్యక్రమాలు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరమణి, మాజీ ఉప సర్పంచ్ గోపాల్, గ్రామపెద్దలు వెంకటరామారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, వీరన్న, గాల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, మమల్లారావు, చెన్నారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా పదోన్నతి

నవాబుపేట: నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో జమీందార్‌గా పనిచేస్తున్న రవీందర్ చారికి ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి చేతుల మీదుగా పత్రాలు అందుకున్నారు. అనంతరం నవాబుపేట ఏఎస్ఐగా విధుల్లో చేరినట్లు ఎస్సై అరుణ్ కుమార్ చెప్పారు. కొంతకాలంగా జమీందార్‌గా పనిచేస్తున్న తనకు ఏఎస్ఐగా పదోన్నతి వచ్చి నవాబుపేటలోనే పోస్టింగ్ వచ్చినందుకు ఉన్నతాధికారులకు రవీందర్‌చారి కృతజ్ఞతలు తెలిపారు.

‘పది’పై ప్రత్యేక శ్రద్ధ

- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అదనపు తరగతులు
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చర్యలు

దౌల్తాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గతంలో కంటే ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూనే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ప్రైవేటుకు దీటుగా మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల ఉన్నత ఫలితాల సాధనకు పూనుకున్నారు. ప్రతి రోజు అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు విధులకు హాజరవుతూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అంతేకాక పాఠ్యాంశాలను సులువుగా అర్థమయ్యే రీతిలో బోధనలో మార్పులు తీసుకురావడం, మెరుగైన ఫలితాలకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

400 మందికిపైగా విద్యార్థులు

మండలంలో ఆరు ఉన్నత, కేజీబీవీలో పాఠశాలలో కలిపి మొత్తం 400కుపైగా విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి సిలబస్‌ను డిసెంబర్ చివరి నాటికి వందశాతం పూర్తి చేసి 2025 జనవరి నుంచి రివిజన్ తరగతులు నిర్వహించడానికి 40 రోజులు ప్రణాళికలు రూపొందించారు. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం గంట పాటు అదనంగా క్లాసులు నిర్వహిస్తూ అవసరమైన మెటీరియల్ అందిస్తున్నారు. వారికి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రత్యేకంగా చదువులో వెనుకబడిన వారిపై శ్రద్ధ తీసుకుంటున్నారు. మెరుగైన విద్యార్థులతో పోటీ పడేలా సన్నద్ధం చేస్తున్నారు.



బాలంపేట ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు

సందేహాల నివృత్తి



సబ్జెక్టుల్లో వచ్చిన సందేహాలను ప్రత్యేక తరగతుల్లో తీరుస్తున్నారు. పాఠశాల సమయం కంటే స్టడీ అవర్స్‌లో బాగా చదువుతున్నాం. ఇలా చదవడంతో పరీక్షలంటే భయం పోయింది. మంచి గ్రేడ్ సాధిస్తామనే నమ్మకం ఉంది.

– సంగీత, పదో తరగతి, బాలంపేట

సాధనతోనే ఉత్తమ ఫలితాలు



పాఠశాలలో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం. ప్రత్యేక తరగతుల్లో సాధనతో ఉత్తమ ఫలితం సాధించవచ్చు. 40 రోజుల ప్రణాళిక తయారు చేసి ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధిస్తున్నాం. ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించడమే ధ్యేయం.

– రాజు, హెచ్ఎం, జెడ్పీ బాలంపేట

దుద్యాల్‌లో 8 ఎంపీటీసీ స్థానాలు

తుది జాబితా విడుదల చేసిన ఎంపీడీఓ కార్యాలయం

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలానికి ఎంపీటీసీ స్థానాలు కేటాయిస్తూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయం తుది జాబితాను విడుదల చేసింది. గతంలో 7 ఎంపీటీసీ స్థానాలు కేటాయిస్తూ ముసాయిదా విడుదల చేసిన విషయం తెలిసిందే. మండల ప్రజల అభ్యర్థన మేరకు అధికారులు 7 ఎంపీటీసీ స్థానాలను ఎనిమిదికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దానితో పాటు కొన్ని గ్రామాలను మార్పులు, చేర్పులు చేశారు. దుద్యాల్–1 స్థానంలో దుద్యాల్ గ్రామం, దుద్యాల్–2 స్థానంలో దుద్యాల్, ఆలేడ్ గ్రామాలు, హకీంపేట్ స్థానానికి హకీంపేట్, అల్లిఖాన్‌పల్లి గ్రామాలు, చిలుములు మైల్వార్ స్థానానికి చిలుముల మైల్వార్, చెట్టుపల్లి తండా, నాజుఖాన్‌పల్లి, ఎక్కచెరువు తండా, సత్తర్‌కుంట తండా గ్రామాలు, కుదురుమల్ల స్థానానికి కుదురుమల్ల, సంగాయిపల్లి గ్రామాలు, గౌరారం స్థానానికి గౌరారం, హంసంపల్లి, ఈర్లపల్లి, సాగారం తండా గ్రామాలు, పోలేపల్లి స్థానానికి పోలేపల్లి గ్రామం, లగచర్ల స్థానానికి లగచర్ల, రోటిబండ తండా, సంట్రకుంట తండాలను కేటాయించారు. ఈ జాబితా ప్రకారమే ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారని సమాచారం.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నేతల డిమాండ్

అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలో ఎనిమిది ఎంపీటీసీ స్థానాలకు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, నాయకులు విష్ణువర్ధన్, నరేశ్‌గౌడ్, శ్రీనివాస్, బసిరెడ్డి, వెంకటయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి శివస్వాముల దీక్షలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో, మండల పరిధిలోని లక్ష్మీపల్లి గ్రామ శ్రీసంఘమేశ్వర దేవాలయంలో 6వ తేదీన(గురువారం) శివస్వాములు అర్ధమండల దీక్షలు స్వీకరించనున్నారు. ఈ మేరకు స్వాముల ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా ఆలయాలలో శివస్వాములకు భిక్ష కార్యక్రమం సైతం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు రథసప్తమి వాహన సేవలు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఉభయ దేవరుల సమేత మలయప్పస్వామి వారు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు. ఏడు వాహనాలపై స్వామి వారు ఆశీనులై భక్తులకు దర్శనమిస్తారు. అర్చకులు ముత్యాల పందిరి, తిరుమంజనం తదితర పూజలను ప్రత్యేకంగా చేస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఇక్కడి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

ప్రజావాణిలో దరఖాస్తులు నిల్

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అధికారులు వేచి చూసినప్పటికి ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాలు, పట్టణంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పైప్‌లైన్లు, వాల్స్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. బైరంపల్లి గ్రిడ్ పరిధిలో నీటి సరఫరా పంపులు తరచూ పాడవుతుండటంతో చాలా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వడ్డెవాడ గ్రామానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎందుకు వేయలేదని, 22 కుటుంబాలు నివాసం ఉంటున్న చిన్న గ్రామానికి పైప్‌లైన్ వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే పైప్‌లైన్ వేసి నీటిని సరఫరా చేయాలని సూచించారు. అదేవిధంగా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. మంచినీటి సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈఈ నాగేశ్వర్, డీఈఈలు సందీప్, అబ్దుల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాజు, పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో గల నల్లచెరువు కట్ట మైసమ్మ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. అతి పురాతనమైన ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు అందించిన దాత నేరట్ల పరిపూర్ణ మహేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసుకొని, దూప, దీప నైవేద్యాలను కొనసాగించడం మంచి పరిణామన్నారు. అదేవిధంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, కొంత సమయం దేవునికి కేటాయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, వెంకటయ్య, సత్యనారాయణరెడ్డి, విక్రంరెడ్డి, నర్సింలు, పాండు, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, లింగం, ఖాజామీయా, నాయకులు తదితరులు ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అభివృద్ధి పనులకు పెద్దపీట

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

బంట్వారం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశంతో కలిసి తొర్మామిడిలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్వాద్‌లో..

కోట్‌పల్లి మండలంలోని బార్వాద్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలతో సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బంట్వారం: రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

గీతా వాహిని సంస్థకు అవార్డు



అవార్డు అందుకుంటున్న గీతా వాహిని బృందం

అనంతగిరి: క్షేత్ర స్థాయిలో భగవద్గీతను ప్రజలలోకి తీసుకెళ్లినందుకు రిఫ్లెక్షన్ చానెల్ ఆధ్వర్యంలో సనాతన కాంక్లేవ్–2025 అవార్డును వికారాబాద్‌కు చెందిన గీతా వాహిని సంస్థకు అందజేశారు. ఆదివారం హైదరాబాద్ నారాయణగూడలోని కేశవ మెమోరియల్ స్కూల్లోని సనాతన కాంక్లేవ్ అవార్డులను ప్రదానం చేశారు. సనాతన కాంక్లేవ్ అవార్డును గీతా వాహిని సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవికి ప్రముఖ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ అందజేశారు. అధ్యక్షురాలు శ్రీదేవి తోపాటు ఉపాధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, సభ్యులు మధూరి, ఝాన్సీ రాణి, కరుణ, సరళ, లక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. 2017 నుంచి గీతా వాహిని ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ముఖ్యంగా ఉచిత భగవద్గీత శిక్షణ తరగతులను వివిధ కాలనీల్లో 2021 వరకు నిర్వహించామన్నారు.

మూలనపడ్డ ట్రాక్టర్

- అవగాహన లోపంతో నీరుగారుతున్న సర్కారు లక్ష్యం
- అప్పుల ఊబిలో మండల మహిళా సమాఖ్య

కొందుర్గు: ప్రభుత్వం మంచి లక్ష్యంతో తలపెట్టిన పథకం అవగాహన లోపంతో నీరుగారుతోంది. ముందుచూపు లేకపోవడంతో పొదుపు చేసిన డబ్బులు కాస్తా అప్పు తీర్చడానికి సరిపోతున్నాయని కొందుర్గు మండల మహిళా సమాఖ్య సభ్యులు వాపోతున్నారు. వ్యవసాయాధారిత మండలమైన కొందుర్గు మండల మహిళా సమాఖ్యకు ట్రాక్టర్ ఇవ్వడంతో అటు రైతులకు ఉపయోగపడటంతో పాటు, ఇటు మండల సమాఖ్యకు ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో 2022 ఏప్రిల్‌లో రూ. 9,12,296 ఖర్చుచేసి ట్రాక్టర్ మంజూరు చేసింది. అలాగే ట్రాక్టర్‌కు సంబంధించిన రూటోవేటర్, కల్టివేటర్, కరిగెట్ చేసే వీల్స్ అందించారు. అదేవిధంగా మరో రూ.2లక్షల విలువైన ట్రాక్టర్ ట్రాలీని అప్పటి కలెక్టర్ సమాఖ్యకు ఉచితంగా అందజేశారు. మొత్తం ట్రాక్టర్ యూనిట్‌కు సంబంధించి రూ. 8,97,300లు స్త్రీనిధి రుణం అందించగా, రూ. 3,45000లు రాయితీ ఉంటుంది. దీనికి గాను రూ.1,38,225లు మండల మహిళా సమాఖ్య వాటా ఖర్చు చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ట్రాక్టర్‌కు డ్రైవర్‌ను కూడా నియమించకపోవడం, కొందుర్గు మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో ట్రాక్టర్లు అధికంగా ఉండటంతో సర్కారు లక్ష్యం నీరుగారుతోంది.



కొందుర్గు మండల సమాఖ్య ఎదుట వృథాగా ఉన్న ట్రాక్టర్

వినియోగంలో లేకపోవడంతో..

రైతులెవరూ ట్రాక్టర్‌ను వినియోగించుకోకపోవడంతో ప్రస్తుతం ట్రాక్టర్ మహిళా సమాఖ్య భవనం ఎదుట వృథాగా పడి ఉంది. ట్రాక్టర్ పని చేయడం లేదు. ట్రాక్టర్‌కు సంబంధించిన వాయిదాలు కట్టడానికి ఇబ్బందిగా మారిందరి సమాఖ్య సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాఖ్యలో తాము పొదుపు చేసిన డబ్బులు వాయిదాల కోసం కట్ చేసుకుంటున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

శంకర్‌పల్లి: మండలంలోని మోకిల గ్రామంలో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి మోకిలతో పాటు చుట్టు పక్కన గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసిపోయింది. కల్యాణోత్సం అనంతరం స్వామివారి త్రిశతి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, వెంకటదాసార్యులు, యాదగిరి చలమాచార్యులు హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మోకిల మాజీ సర్పంచ్ సుమిత్రమోహన్‌రెడ్డి, వక్తలు డా.అంజయ్య, చెన్నయ్య, లాల్‌రెడ్డి, తూర్పు మల్లారెడ్డి, గంటా మనోహర్‌రెడ్డి, ఆశీర్వాదం, కమలేశ్ పాల్గొన్నారు.



అనంతగిరి: సరస్వతీ శిశుమందిరంలో సరస్వతీ రూపంలో చిన్నారులు



దుద్యాల్: సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు



తాండూరు టౌన్ : అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారి

ఘనంగా వసంత పంచమి

వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించి ఆశీర్వదించారు. పాఠశాలల్లో సాముహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సరస్వతీమాతకు ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



కుల్కచర్ల: కేజీబీవీలో వేడుకలు నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి దేవి, ఉపాధ్యాయ బృందం



పరిగి: వసంత పంచమి వేడుక



అనంతగిరి: గొట్టిముక్కులలో అక్షరాభ్యాసం



కొడంగల్ రూరల్ : చిన్నారులకు అక్షరాభ్యాసం